క్లుప్తంగా

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



ఇందల్వాయి: విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని డీఈ అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లిలో విద్యుత్ అధికారులు శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తుందని అన్నారు. రైతులతో సమావేశమై విద్యుత్ సమస్యలు, సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు, ప్రజలు ఎవరూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్వీయ మరమ్మతులు చేపట్టవద్దని, సమస్య ఏదైనా స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఏఈ పండరినాథ్, లైన్‌మన్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు అంతరిక్షంలో మన శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు, వారి ప్రాముఖ్యతను విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకురాలు పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేటలో సత్యసాయి సేవాసమితి ధర్పల్లి ఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రతిమను పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి భజనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ ఈశ్వర్, సభ్యులు శంకర్, బుచ్చన్న, శ్రీహరి, రాజ్ కుమార్, గంగాధర్, గంగ స్వామి, శోభ, జ్యోతి, వినిత, లక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ రామ్‌రెడ్డి దూర విశ్వవిద్యాలయంలో యూజీ, పీజీ ప్రవేశాల కోసం విద్యార్థులు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎంబీఏ, ఎంఏ, ఎంసీఏ, ఎమ్‌కాం, ఎమ్మెస్సీ, యూజీలో బీఏ, బీకాం, బీబీఏ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9912670252 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు బాగా చదవాలి

ఇందల్వాయి: విద్యార్థులు బాగా చదివి మంచి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎల్లారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మతంల శేఖర్, మనోహరబాద్ మాజీ సర్పంచ్ పాట్కారి తిరుపతిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన రుచిత, దీపిక, శ్రీహితలకు వీరు నగదు ప్రోత్సాహాన్ని శనివారం అందజేశారు. హెచ్ఎం చంద్రశేఖర్, నాయిడి రాజన్న, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెడికోపై సీనియర్ల దాడి?

- జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం విద్యార్థిపై పీజీ విద్యార్థులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనతో శనివారం రాత్రి ఆస్పత్రి ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్నల్ డ్యూటీలో భాగంగా సదరు మెడికో జనరల్ ఆస్పత్రిలో ఇటీవల విధులు నిర్వర్తించినప్పటికీ అతడు విధులకు గైర్హాజరైనట్లు సీనియర్లు రిజిస్టర్‌లో నమోదు చేశారు. తాను డ్యూటీ చేసినప్పటికీ గైర్హాజరైనట్లు ఎందుకు నోట్ చేశారని సదరు విద్యార్థి సీనియర్ల(పీజీ) వద్దకు వెళ్లి ప్రశ్నించడంతో సుమారు పది మంది కలిసి అతడిని చితకబాదారు. సదరు విద్యార్థి తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పినా వినకుండా సీనియర్లు చితకబాదినట్లు సమాచారం. అయితే ఈ విషయం బయటికి పొక్కకుండా మెడికల్‌కళాశాల, ఆస్పత్రి వర్గాలు జాగ్రత్తలు తీసుకోవడం చర్చనీయాంశమైంది.

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా రాణించాలి

- నీట్, జేఈఈ, ఏపీసెట్‌పై విద్యార్థులు దృష్టి సారించాలి
- జిల్లా ఇంటర్ ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న



డిచ్‌పల్లిలో లెక్చరర్లతో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ ప్రత్యేకాధికారి ఒడ్డెన్న



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్ ప్రత్యేకాధికారి ఒడ్డెన్న

డిచ్‌పల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు దీటుగా నీట్, జేఈఈ, ఏపీసెట్ లలో రాణించి ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లు సాధించాలని నిజామాబాద్ జిల్లా ఇంటర్ ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న సూచించారు. శనివారం డీఐఈవో రవికుమార్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు నర్సయ్యతో కలిసి జిల్లా ప్రత్యేకాధికారి ఒడ్డెన్న డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలకు రెగ్యులర్ గా వస్తే కలిగే లాభాలు, రాకపోతే కలిగే నష్టాలను వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు తాము ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల విద్యార్థులతో పోటీ పడలేమనే అపోహతో నీట్, జేఈఈ, ఏపీసెట్ తదితర ప్రవేశ పరీక్షలపై సరైన దృష్టి సారించడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పది వేల లోపు ర్యాంకు వస్తే ఇంజినీరింగ్, మెడిసిన్ విద్య ఎలాంటి ఫీజు చెల్లించనవసరం లేదని, అయితే ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు లక్ష వరకు ర్యాంకు వచ్చినా నామమాత్రపు ఫీజు చెల్లించి చదివే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉన్నత విద్య నేర్చుకోవడానికి ఎన్నో వెలుసుబాట్లు కల్పిస్తుందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల లెక్చరర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు చదువు మధ్యలో ఆపివేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు రావడానికి ఫేషియల్ రిజిస్ట్రేషన్ అడెంటెన్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రవిఠల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బోర్గాం(పి)లో విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులతో ఇన్‌చార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు

మోపాల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. యూత్ ఫెస్ట్‌లో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీ, బ్లడ్ డొనేషన్ అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలకు నగరంలోని ఐదు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముబారక్‌నగర్ జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన దీక్షిత, గంగోత్రి మొదటిస్థానం, కుమార్‌గల్లి జీహెచ్ఎస్‌కు చెందిన లావణ్య, ఫిర్దోస్ ద్వితీయస్థానంలో నిలిచారు. విజేతలకు ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీకాంత్ మెడల్స్ అందజేశారు. త్వరలోనే విజేతలకు క్యాష్ ప్రైజ్, సర్టిఫికెట్లను కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వో అందజేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈనెల 30న నిర్వహించే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు పంపిస్తామని డీహెచ్ఈ కో–ఆర్డినేటర్ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, సీఎస్‌వో నవీన్, సీపీవో మోయిజ్, ఎస్ఎస్‌కే మేనేజర్ స్రవంతి, స్నేహ సొసైటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదరిద్దాం



నిజామాబాద్‌నాగారం: దేశానికే అన్నం పెట్టే రైతులను ఆదరిద్దామని.. వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వ మున్నూరు కాపు జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని జిల్లాలోని పది మంది యువరైతులను ఉత్తమ రైతులుగా ఎంపిక చేసి సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం కోశాధికారి ధర్మపురి సురేందర్, తోట రాజశేఖర్, డాక్టర్ అబ్బపు రవీందర్, బుస ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, నరేశ్, హరిచరణ్, బాశెట్టి సురేశ్ కుమార్, సత్యనారాయణ, అబ్బాయిల లింబాద్రి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు



యానంపల్లిలో..

నిజామాబాద్‌అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, బట్టు బద్రినాథ్ అన్నారు. శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తపస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భోజన విరామ సమయంలో అన్ని మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రామకృష్ణారెడ్డి కీర్తి సుదర్శన్, వరప్రసాద్, వివిధ మండలాల, జిల్లా బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం

డిచ్‌పల్లి: సీపీఎస్‌ను రద్దు చేసే వరకు తపస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని డివిజన్ కార్యదర్శి డింగరి మధుసూదనాచారి పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి, రాంపూర్, మిట్టాపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సాయంత్రం జీవో నంబర్ 29 ప్రతులను దహనం చేసి అనంతరం తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసే వరకు తపస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి



సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నిజామాబాద్ సిటీ: సీపీఐ అగ్రనాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సీపీఎం నాయకులు ఘన నివాళులు అర్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న పార్టీ కార్యాలయంలో సురవరంకు శ్రద్ధాంజలి నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్లవ ఉద్యమాలకు సురవరం చేసిన సేవలు కొనియాడారు. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ప్రజల పక్షాన జీవితాంతం పనిచేశారని, ఎన్నో పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సుజాత, విఘ్నేశ్, కటారి రాములు, రాజు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో..

సీపీఐ అగ్ర నాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో సురవరం కీలక పాత్ర పోషించారన్నారు. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యారంగ సమస్యలపై పోరాడారన్నారు. కార్యక్రమంలో రంజిత్, హనుమాన్లు, సక్కి సురేశ్, అలీ ఇమ్రాన్, ఫిరోజ్ అలీ, కుషాల్, టోకు పాల్గొన్నారు.

నూతన వైద్యులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: అర్బన్ హెల్త్ సెంటర్లలో నూతనంగా విధుల్లో చేరిన వైద్యులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ సూచించారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో యూపీహెచ్‌సీలలో కొత్తగా విధుల్లో చేరిన మెడికల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో చేయాల్సిన పనులు, రికార్డులు, మెయింటెన్, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్, ఏఎన్‌సీ నిర్వహణ, పలు అంశాలపై వారికి వివరించారు. జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ సుప్రియ, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో సీపీ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సీపీ సాయి చైతన్య

నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వర హనుమాన్ ఆలయంలో సీపీ సాయి చైతన్య శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసంలో చివరి శనివారం కావడంతో నీలకంఠేశ్వర ఆలయంలోని ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అభిషేకం, అర్చనలు చేశారు.

నేటి చిత్రం



రోడ్డుపైనే మురుగునీరు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రేడియోస్టేషన్ పక్కన ఉన్న పట్టణ మహిళా నిరాశ్రయుల భవనానికి వెళ్లే దారిలో రోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. ఈ ప్రాంతంలో మురికి కాలువ లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. కొన్ని నెలలుగా రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– విజయలక్ష్మి, స్థానికురాలు

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

కాంగ్రెస్ పాలనలో విద్యా రంగం కుదేలు



ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్ : కాంగ్రెస్ పాలనలో విద్యా రంగం కుదేలైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జిలను పెంచాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 30న విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. నాయకులు విఘ్నేశ్, రమేశ్ బాబు, రాజు కుమార్, ఆజాద్, చక్రి, గోవింద్, గణేశ్, సతీశ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల ఫొటో గ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల రవి, ఉపాధ్యక్షుడిగా పరమల రవి, కోశాధికారిగా బొట్ల వివేక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రసాద్, ధనుంజయ్ గౌడ్, ప్రవీణ్, బొట్ల అజయ్, గణేశ్, విష్ణు, మల్లేశ్ పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నిరుపయోగంగా పసుపు కేంద్రం

- శిథిలావస్థకు చేరిన వైనం
- శాస్త్రవేత్తలు లేకపోవడంతో నష్టపోతున్న రైతులు



ధర్పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రం

ధర్పల్లి: పసుపు రైతు ఆవేదన అంతా ఇంతా కాదు. ఏ రకం విత్తనం వేయాలో ఏ పద్ధతిలో పంటను పండించాలో తెలియక పసుపు రైతులు అగచాట్లు పడుతున్నారు. పండించిన పసుపు పంటకు తెగుళ్లు సోకినప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చే శాస్త్రవేత్తలు కరువయ్యారు. అధిక మొత్తంలో పసుపు పంటపైన పెట్టుబడులు పెట్టి ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో నష్టపోయి పసుపు రైతులు కుంగిపోతున్నారు. ధర్పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించకపోవడంతో ఎవరూ లేక భవనం శిథిలావస్థకు చేరింది.నాణ్యమైన పసుపు సాగుకు సలహాలు సూచనలు అందించాలన్న ఉద్దేశంతో నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో 200 వందల ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేస్తున్నారు. దీనికి తోడు చుట్టుపక్కల మండలాలైన సిరికొండ, భీంగల్, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో రైతులు పసుపు సాగును అధికంగా చేపడతారు. పసుపు సాగులో కొత్త మార్పులు, సాగు విధానం సలహాలు సూచనలు అందించే ఉద్దేశంతో రైతులు నష్టపోకుండా ధర్పల్లి కేంద్రంగా అప్పటి ప్రభుత్వం 2008లో పసుపు పరిశోధన కోసం స్థలాన్ని కొనుగోలు చేసి భవనాలను నిర్మించింది. కాని పరిశోధనలకు కావాల్సిన సిబ్బంది, పరికరాలు కేటాయించకపోవడంతో వృథాగా మారాయి. అప్పటి ప్రభుత్వం రూ. 35.85 లక్షలు మంజూరు చేసి, తొలి విడతగా రూ. 15 లక్షలు విడుదల చేసింది. మంజూరైన నిధులతో పరిశోధనలు జరుగుతాయని ఆశించినప్పటికి ఫలితం లేకుండా పోయింది.

చిగురించిన ఆశలు

జిల్లాలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయడంతో పసుపు రైతులు ఆశలు చిగురించాయి. ఇక్కడ పసుపు సాగు చేసే రైతులు తమ పంటకు సరైన ధర లభించడం, నాణ్యమైన విత్తనాలు, శీతల గిడ్డంగులు, అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నా రు. గతంలో తక్కువ ధరలకు పసుపు అమ్ముకోవాల్సిన రైతులు ఇప్పుడు బోర్డు ఏర్పాటుతో తమ కష్టాలకు తగిన ప్రతిఫలం లభిస్తుందని భావిస్తున్నారు. అలాగే పసుపు బోర్డు కమిటీతోపాటు ప్రభుత్వం చొరవ తీసుకొని ధర్పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని పసుపు రైతులు కోరుతున్నారు.

సిబ్బంది కరువు

పరిశోధన కేంద్రాలకు అవసరమైన శాస్త్రవేత్తలు, సిబ్బంది కేటాయించకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ప్రధానంగా ధర్పల్లి, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో స్థలాలు కొనుగోలు చేసి భవనాల నిర్మాణం చేపట్టారు. కేవలం కమ్మర్‌పల్లి మండలంలో ఉన్న పసుపు పరిశోధన కేంద్రంలో మాత్రమే పరిశోధనలు జరుగుతున్నాయి. జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, నందిపేట్, జక్రాన్ పల్లి, మెండోరా, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, కమ్మర్పల్లి, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో అత్యధికంగా పసుపు పంటను సాగు చేస్తారు. ఆధునిక యాంత్రీకరణ విధానాలు తెలియకపోవడం వల్ల ఇప్పటికీ రైతులు మూస పద్ధతిలో పసుపు సాగు విధానాన్ని చేపడుతున్నారు.

శాస్త్రవేత్తలను నియమించాలి



తరతరాలుగా పసుపు పంటను సాగు చేస్తున్నాం. ఒకే రకం సాగు విధానంతో పసుపు పండించడంతో నష్టపోతున్నాం. మాకు శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటే వారు చెప్పే సలహాలు సూచనల ఆధారంగా పంట సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చు.

– మచ్చర్ల నడ్పి రాములు, పసుపు రైతు, గడ్కోల్

నష్టపోతున్నాం..



పసుపు పంటను పండించి నష్టపోతున్నాం. శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటే కొత్త టెక్నాలజీతో పసుపు పంటలు పండించవచ్చు. పసుపు రైతు నష్టపోకుండా ఉంటాడు. మాతో పాటు చుట్టుపక్కల మండల రైతులకు పసుపు పరిశోధన కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గడ్డం గంగారెడ్డి, పసుపు రైతు, ధర్పల్లి

25 నుంచి విద్యార్థి పోరుబాట



నిజామాబాద్‌అర్బన్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 30 వరకు విద్యార్థి పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ తెలిపారు. నగరంలోని కోటగల్లిలో ఉన్న నీలం రామచంద్రయ్య భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ. లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలు నడిపిస్తున్నా ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేక టీచర్, అధ్యాపకుల పోస్టుల ఖాళీలతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని అన్నారు. జిల్లాకు ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నసీర్, వినోద్, సజన్, వైష్ణవి, నందిని, మహేందర్, మని తేజ, కార్తీక్, విజయ్, మానస తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ : 9849180084
నిజామాబాద్ రూరల్ : 9966958559
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899